అన్నదాత సుఖీభవ



వైర్లెస్ కాలనీలో భిక్ష స్వీకరిస్తున్న స్వాములు

- మాలధారులకు అన్నప్రసాదం
- దాతల సహకారంతో కేంద్రాల నిర్వహణ
- వైర్లెస్ కాలనీ, వన్‌టౌన్, పూర్ణామార్కెట్ ప్రాంతాల్లో ఏర్పాటు
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చే స్వాములు, పేద భక్తులకు ఎంతో ప్రయోజనం

అల్లిపురం: విజయనగరానికి చెందిన అయ్యప్ప మాలధారి వెంకటరావు పని మీద నగరానికి వచ్చారు. సబ్బవరానికి చెందిన మరో మాలధారి నారాయణరావు కూడా ఇక్కడికి వచ్చారు. మధ్యాహ్నం భిక్ష కోసం చుట్టుపక్కల వాకబు చేశారు. దీంతో వారికి అల్లిపురం రైల్వేక్వార్టర్స్ వద్ద గల వైర్లెస్ కాలనీ శ్రీ కోదండ రామచంద్ర స్వామి ఆలయంలోను, వెంకటేశ్వరమెట్ట పైన గల శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయంలోను అన్నదాన కేంద్రాలు వెలిశాయని చెప్పటంతో వారు అక్కడికి చేరుకుని మధ్యాహ్నం భిక్ష పూర్తి చేసుకున్నారు. ఈ విధంగా ఎంతో మంది అన్ని రకాల మాలధారులు, పేద భక్తులకు ప్రయోజనం కలుగుతుంది.

వెంకటేశ్వరమెట్టపై..

వెంకటేశ్వరమెట్టపై గత 77 సంవత్సరాలుగా శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా గత 30 ఏళ్ల నుంచి అమ్మవారి సన్నిధిలో అయ్యప్పలు, భవానీలు, ఇతర మాలధారులకు నెల రోజుల పాటు అన్నసమారాధన చేపడుతున్నారు. ప్రతి ఏడాది భక్తులు, దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ దిగ్విజయంగా చేపడుతున్నట్లు గౌరీ సంఘం, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు పాలమరశెట్టి శ్యామ్‌కుమార్, పాలమరశెట్టి శ్రీను తెలిపారు.



వెంకటేశ్వరమెట్టపై స్వాములు, భవానీలకు అన్నసమారాధన

అద్భుతం.. అయ్యప్ప ప్రసాదం..

నగరంలో రైల్వే క్వార్టర్స్‌లో శ్రీ హరిహరాత్మజ అన్నదాన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా వైర్లెస్ కాలనీలోని శ్రీ కోదండ రామచంద్రస్వామి ఆలయంలో ఏడేళ్లుగా మాలధారులకు అన్నదానం చేస్తున్నారు. 41 రోజుల పాటు అయ్యప్ప స్వాములు, భవానీ, శివ దీక్ష, షిర్డీసాయి దీక్ష, వేంకటేశ్వర స్వామి దీక్షధారులకు అన్న సమారాధన జరుగుతోంది. రోజుకి సుమారు 1500 మంది స్వాములు, ఇతర మాలధారులు అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. నగరానికి పనిమీద వచ్చిన స్వాములు మధ్యాహ్నం భిక్షకు వారి పీఠానికి వెళ్లనక్కర లేకుండా, దీక్షకు అంతరాయం కలగకుండా ట్రస్టు వారు ఏర్పాట్లు చేశారు. తమతో పది మందికి అన్నదానం చేయిస్తున్నది ఆ అయ్యప్ప అని, ఇందులో తమ గొప్పతనం ఏమీ లేదని ట్రస్టు అధ్యక్షుడు కంచు వెంకటరమణమూర్తి తెలిపారు.

పలు చోట్ల అయ్యప్పలకు భిక్ష ఏర్పాటు..



వైర్లెస్ కాలనీలో శ్రీ హరి హరాత్మజా ఛారిటబుల్ ట్రస్ట్, శ్రీ కోదండ రామచంద్రస్వామి దేవాలయం సంయుక్తంగా గత రెండు సంవత్సరాలుగా స్వాములకు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నాయి. వన్‌టౌన్ పాత రామాలయంలోను మధ్యాహ్నం భిక్ష పెడుతున్నారు. వన్‌టౌన్ రామాలయంలో కూడా అన్నదానం జరుగుతోంది.

– నీలాపు రమణారెడ్డి, గురుస్వామి, అల్లిపురం

30 సంవత్సరాలుగా అన్నసమారాధన..



వెంకటేశ్వరమెట్టపై గత 30 సంవత్సరాలుగా అయ్యప్పలకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రతి ఏడాది గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహిస్తుంటాం. దీంట్లో భాగంగా అయ్యప్పలకు అన్నసమారాధన నెలరోజుల పాటు చేపడుతుంటాం. మంచి స్పందన వస్తుంది.

– సూరిశెట్టి చిట్టినాయుడు, వెంకటేశ్వరమెట్ట

గొప్ప నిర్ణయం..



అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదని పెద్దలు చెబుతారు. ఒకటి రెండు రోజులు కాదు ఏకంగా 41 రోజుల పాటు అన్నదానం చేయడమంటే చిన్న విషయం కాదు. దాతలు సహకరించినా కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడం, మాలధారులకు ఏ లోటు లేకుండా చూసుకోవడం గొప్ప విషయం. వారికి అభినందనలు.

– అభిషేక్ స్వామి, దాత

అన్నదానం మహాదానం..



ఎంతో మందికి మాలధారణ చేయాలని ఉన్నా ఇంట్లో భిక్షకు అవకాశం ఉండదు. మహిళలకు కుదరక ఇబ్బంది పడేవారుంటారు. పనులపై నగరానికి వచ్చిన స్వాములు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అన్నదానం మహాదానం. స్వాములకు భిక్ష పెట్టాలని ఉన్నా చేయలేని వారు ఇక్కడ ఆర్థిక సాయం చేస్తే స్వకార్యం.. స్వామికార్యం తీరుతాయి.

–కంచు వెంకట రమణమూర్తి, అధ్యక్షుడు, శ్రీ హరి హరాత్మజ అన్నదాన ఛారిటబుల్ ట్రస్ట్

బయటి నుంచి వచ్చే స్వాములకు సౌలభ్యం..



బయటి ఊళ్ల నుంచి పనిపై నగరానికి వచ్చే స్వాములకు ఈ అన్నసమారాధన కేంద్రాలు సౌలభ్యంగా మారాయి. పని చూసుకుని మధ్యాహ్నం భిక్ష పూర్తి చేసుకుని తిరిగి సాయంత్రానికి ఇంటికి చేరుకోవడానికి వీలుగా ఉంది. శుచి శుభ్రతతో ఆహారం అందజేస్తున్నారు. అయ్యప్పలే ఈ కేంద్రాలు నిర్వహించడం అభినందనీయం.

– బాల శంకర్, అల్లిపురం

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం..



ప్రతి ఏడాది శ్రీ గౌరీ సంఘం, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం సంయుక్తంగా శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటాం. దీంట్లో భాగంగా ప్రతి ఏడాది నెల రోజుల పాటు అన్నసమారాధన నిర్వహిస్తాం. దాతలు సహకరిస్తున్నారు.

–పాలమరశెట్టి శ్రీను, ప్రధాన కార్యదర్శి, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం

అప్పన్నను దర్శించుకున్న కలెక్టర్



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న కలెక్టర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాత్రి కలెక్టర్ హరేందిర ప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనమిచ్చారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు. సింహగిరి పైనున్న కాటేజీలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజుతో పలు విషయాలపై కలెక్టర్ చర్చించారు. దేవస్థానం పంచగ్రామాల భూసమస్యకి సంబంధించి ప్రభుత్వం ఇచ్చే ప్రత్యామ్నాయ స్థలం, ప్రసాద్ స్కీమ్ పనులపై మాట్లాడినట్లు తెలిసింది.

మెరుగైన వసతులు పొందడమే లక్ష్యం



సంఘీభావం తెలుపుతున్న గాండ్ల తెలికుల పెన్షనర్ల సంఘం సభ్యులు

అల్లిపురం: రాష్ట్రంలో మెరుగైన వసతులు, అవకాశాలు పొందడమే లక్ష్యంగా పని చేస్తున్నామని గాండ్ల తెలికుల పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ అన్నారు. సంఘం ఆత్మీయ సమావేశం ఆదివారం కలెక్టరేట్ దరి ఎన్‌జీవో హోంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించాలని సంఘం తీసుకున్న నిర్ణయానికి కార్యక్రమం వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గిరి శ్రీనివాస్, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం తదితర జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు మార్గశిర మాస రాట మహోత్సవం



సిరులతల్లి కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, ఆంధ్రుల ఆరాధ్యదైవం, సౌభాగ్య ప్రదాయిని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో డిసెంబర్ 2 నుంచి 30 వరకు మార్గశిర మాసోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు శుభారంభ సూచికగా రాట మహోత్సవం ఈ నెల 12న జరపనున్నారు. ప్రతి ఏటా కార్తీక శుద్ధ ఏకాదశి రోజున రాట వేసి మార్గశిర మాసోత్సవాలకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఆ సాంప్రదాయం ప్రకారం ఆ రోజు ఉదయం నాదస్వరాలు, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఉత్సవం నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఉత్సవాలు, సేవలు, దర్శనాలకు సంబంధించి చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఆహ్వానించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు.

దంత వైద్య శిబిరానికి స్పందన



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయం ఆవరణలో నిర్వహించిన దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, గ్రంథాలయ అధ్యక్షుడు పాలమరశెట్టి శ్యామ్, పాలమరశెట్టి శ్రీను, భీశెట్టి గోపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దంత వైద్య నిపుణులు డాక్టర్ సంతోషిమాత సియాద్రి, డాక్టర్ సురేష్ 71 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు రెండు పూటలా బ్రష్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గ్యార్వీ షరీఫ్ ఉర్సు ఉత్సవం



షరీఫ్‌ను సత్కరిస్తున్న మసీదు ప్రతినిధులు

అల్లిపురం: చలువతోటలో గల గార్వీ షరీఫ్ ఉర్సు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో తిరువీధి ఉత్సవం నిర్వహించి చందనం సమర్పించారు. అనంతరం గురువు గులామ్ ముస్తఫా పాల్గొని ఖురాన్ ఖానీ, సందోల్, బయాన్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. తర్వాత 2వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా గురువు షరీఫ్‌ను మసీదు ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

జాబ్‌మేళా రేపు

మహారాణిపేట: నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న మహారాణిపేట నాక్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ మేళాలో వీల్స్‌మార్ట్, 2 నిధి ఫైనాన్షియల్ సర్వీసెస్, పే-టీమ్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. వివరాలకు 9676170026 సంప్రదించాలన్నారు.

నేడు జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

కుటుంబం చెంతకు అభాగ్యులు



బిందుని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఏయూటీడీ సిబ్బంది



రాహుల్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

సీతమ్మధార: ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌నగర్‌కు చెందిన బిందు (45) అనే మహిళ పదేళ్ల నుండి మానసిక వ్యాధితో బాధపడుతోంది. భర్త విడాకులు ఇచ్చేసి తల్లి శాంతిదేవి దగ్గరకు పంపేశాడు. కొడుకుని కూడా దూరం చేయడంతో ఆత్మహత్య చేసుకోబోయింది. తల్లి చెప్పిన వివరాల ప్రకారం 8 నెలల క్రితం ఇంట్లో నుండి విశాఖ వచ్చింది. సమాచారం తెలుసుకుని ఏయూటీడీ సిబ్బంది వైజాగ్ రైల్వే స్టేషన్‌లో ఉన్న బిందుని రెస్క్యూ చేసి మహిళ వసతి గృహానికి తరలించారు. శ్రద్ధా ఫౌండేషన్ ట్రీట్‌మెంట్‌తో వ్యాధి నుండి కోలుకుంది. శ్రద్ధా సోషల్ వర్కర్లు ఎలీనా, నీలా వైజాగ్ నుంచి బిందుని తీసుకెళ్లి తల్లికి క్షేమంగా అప్పగించారు.

పోలీసుల సాయంతో కన్నవారి చెంతకు..

మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా ఖండరీ గ్రామ నివాసి అయిన రాహుల్ 6 నెలల క్రితం వైజాగ్ వచ్చేశాడు. ఏయూటీడీ చేరదీసి ఆశ్రయం కల్పించింది. శ్రద్ధా వలంటీర్ డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో ట్రీట్‌మెంట్ చేసి, మందులిచ్చి సొంతూరు తీసుకెళ్లారు. అన్నయ్య రామచంద్ర, భార్య రాహుల్‌ను ఇంట్లోకి రానిచ్చేందుకు నిరాకరించారు. దాంతో కన్హన్ స్టేషన్ పోలీసుల సహాయంతో కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి రాహుల్‌ని వారికి అప్పగించారు. శ్రద్ధా తరపున నితీష్, శివం పాల్గొన్నారు.

బకాయి వేతనాల కోసం 104 ఉద్యోగుల ధర్నా



గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

సీతమ్మధార: గడచిన మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా 104 ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి. మణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వమే నేరుగా పీహెచ్‌సీల ద్వారా 104 సర్వీసులు నిర్వహించాలని, 2020 తర్వాత నియమితులైన వారికి జీవో నంబర్ ఏడు ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీఎఫ్‌లో యాజమాన్య వాటా యాజమాన్యమే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, 3 సంవత్సరాల అలవెన్స్‌లు, ఇంక్రిమెంట్ బకాయిలు చెల్లించాలని, వాహనాల నిర్వహణ (మరమ్మతులను) తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో సీఐటీయూ జిల్లా నాయకుడు జి. అప్పలరాజు, అధ్యక్ష, కార్యదర్శులు తాతబాబు, భాస్కర్, జిల్లా కమిటీ నాయకులు భవ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉబ్బిన నరాల సమస్యకు గో వాస్క్యులర్‌తో ఉత్తమ చికిత్స



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఈస్ట్ డివిజన్ ఏసీపీ లక్ష్మణమూర్తి

డాబాగార్డెన్స్: శరీరంలో ఉబ్బిన సిరల సమస్యల పరిష్కారానికి గో వాస్క్యులర్ వైద్య సేవలు విశాఖలోని విజేత ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చాయి. కేజీహెచ్ డౌన్‌రోడ్డులో గల విజేత ఆస్పత్రి, హైదరాబాద్‌కి చెందిన గో వాస్క్యులర్ ఆస్పత్రి సంయుక్త నిర్వహణలో ఆదివారం ఉచిత వైద్య చికిత్స క్లినిక్‌ను ఈస్ట్ డివిజన్ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉబ్బిన సిరల సమస్యల పరిష్కారం కోసం క్లినిక్ ప్రారంభించడం సంతోషకరమన్నారు. గో వాస్క్యులర్ ఆస్పత్రి ప్రతినిధి, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్, ఎండోవాస్క్యులర్ సర్జన్ డాక్టర్ సంపత్ వాదిత్య మాట్లాడుతూ ఉబ్బిన సిరల సమస్యకు అత్యాధునిక లేజర్ థెరపీ చికిత్స 2 గంటల్లో చేసి రోగికి ఇంటికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో విజేత ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ క్రిటికల్ కేర్ వైద్య నిపుణుడు డాక్టర్ కె. కూర్మనాథ్, విశ్రాంత న్యాయమూర్తి పైలా సన్నిబాబు, ఉత్తరాంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు నరవ రాంబాబు, జేకే నాయక్, డాక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణ, డాక్టర్ సంపత్‌కుమార్, ఎం. ఈశ్వరరావు, సందీప్, నరవ పంకజ్, టీవీడీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

సీతమ్మధార: ఉత్తరాంధ్ర కరవు, వలసలు, విద్య, ఉపాధి రంగ సమస్యలు, కర్తవ్యాలు అనే అంశంపై జరిగే ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును విజయవంతం చేయాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను పీడీఎస్‌వో విశాఖ జిల్లా కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి అన్ని పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయని కారణంగానే వలసలు అధికమవుతున్నాయి అన్నారు. విభజన హామీలు, విశాఖ రైల్వే జోన్, సెంట్రల్ యూనివర్సిటీ, విద్యా సంస్థలకు నిధుల కేటాయింపు వంటి హామీలను అమలు చేయాలన్నారు. మూతపడ్డ జూట్, చెక్కర తదితర వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తెరిపించి యువతకు ఉపాధి కల్పించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే విరమించి సొంత గనులు కేటాయించాలని, ప్రైవేటీకరించిన ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. విజయనగరంలో జరగబోయే ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సులో పీడీఎస్‌వో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్. రుద్రి, జిల్లా నాయకులు సతీష్ కుమార్, జానకి, మణీంద్ర, వసంత్, సురేష్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన మురళి

మహారాణిపేట: అనాథ శవానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. వడ్డాది మాడుగుల ప్రాంతానికి చెందిన బుదిరెడ్డి ఏసుబాబు (45) తల్లిదండ్రులు చిన్నతనంలో చనిపోయారు. ఆర్.కె.బీచ్‌లో అనారోగ్యంతో బాధపడుతుంటే అక్కడున్న వారు ఇచ్చిన సమాచారం మేరకు గత నెల 26న ఏసుబాబును రెడ్ క్రాస్‌కు తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం గత నెల 31న కేజీహెచ్‌లో అడ్మిట్ చేశారు. చికిత్స పొందుతూ ఈనెల 6వ తేదీన ఏసుబాబు తుది శ్వాస విడిచారు. ఎంవీపీ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇనస్పెక్టర్ జె.మురళీకృష్ణ సహకారంతో హోంలెస్ షెల్టర్, రెడ్ క్రాస్‌కు చెందిన మురళి అంత్యక్రియలు నిర్వహించారు. ఏసుబాబు అంత్యక్రియలకు రెడ్ క్రాస్, ఎంవీపీ పోలీసులు, హోంలెస్ షెల్టర్ (పెదవాల్తేర్) ఎంతో సహకరించాయని మురళి తెలిపారు. వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



గాత్ర కచేరీతో ఆకట్టుకున్న సరస్వతి

డాబాగార్డెన్స్: రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులో గల రాఘవేంద్రస్వామి మఠంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి సారథ్యంలో ఆదివారం ఆంధ్ర విశ్వకళా పరిషత్ సంగీత విభాగానికి చెందిన ఆచార్య కె. సరస్వతి తన గాత్ర కచేరీతో శ్రోతలను మైమరిపించారు. కార్యక్రమంలో ముందుగా ఐవీఎల్ శాస్త్రి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కచేరీలో పాల్గొన్న సరస్వతి త్యాగరాజ స్వామి కీర్తనలు, ముత్తుస్వామి దీక్షితార్ కృతులు, పట్నం సుబ్రహ్మణ్యం అయ్యర్ రచించిన కీర్తనలను మృదు మధుర గాత్రంతో ఆలపించగా, వయోలిన్‌పై హెచ్ రామ్‌చరణ్, మృదంగంపై రవి, మోర్సింగ్‌పై జి. వెంకటేష్ వాద్య సహకారమందించారు. కార్యక్రమంలో పేరాల బాల మురళీకృష్ణ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట్రావు, కార్యదర్శి పి. జగన్మోహనరావు, కోశాధికారి మధుబాబు, సమితి సభ్యులు సుబ్రహ్మణ్యం, మధుసూదనరావు, కళాభిమానులు పాల్గొన్నారు.

మంచం పట్టిన కార్మికులకు సిటు పరామర్శ



కార్మికురాలిని పరామర్శిస్తున్న సిటు నాయకులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 98 వార్డు పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య, క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్స్ వివిధ కారణాల (రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా)తో ఆస్పత్రి పాలు కాగా.. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) విశాఖ జిల్లా కమిటీ, జోన్ కమిటీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిటు నాయకులు గొలగాని అప్పారావు, టి. నూకరాజు, ఈశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. అనారోగ్యం, రిటైర్మెంట్, డెత్ అయిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నెహ్రూ సేవలు మరువలేనివి

సీతంపేట: స్వాతంత్ర్య సమరయోధునిగా, దేశ మొదటి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువలేనివని నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాల ఆవరణలో గల గాంధీ సెంటర్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణం, పంచశీల విధానంలో నెహ్రూ సేవలను గుర్తు చేశారు. ఆచార్య పి. పద్దయ్య, సీనియర్ న్యాయవాది సి.ఎస్.పి.కృష్ణారావు పాల్గొన్నారు.

20 ఏళ్లుగా పని చేస్తున్నా రూ.15 వేలే



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగంలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నా రూ.15 వేలే జీతం ఇస్తున్నారని, ఇటీవల ఆఘమేఘాలపై చేర్చుకున్న కార్మికులకు రూ.18 వేలు ఇవ్వడంలో ఆంతర్యమేమిటో అని జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ యూనియన్ నాయకులు, వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, నాయకులు ఆనంద్‌కుమార్, వెంకట్రావు, సీహెచ్ రాజు, రమణ, సత్యనారాయణ మాట్లాడారు. జీవీఎంసీ మంచినీటి విభాగంలో పని చేస్తున్న కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్న ఎస్ఈ కేవీఎన్ రవిని విధుల నుంచి తప్పించి, అతని అవినీతి, నియామకాల్లో అక్రమాలపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. డెత్, సిక్‌కి సంబంధించి వంద పోస్టుల వరకు భర్తీ చేయాల్సి ఉంటే.. అవి భర్తీ చేయకుండా అక్రమంగా డబ్బులు వసూలు చేసి 96 పోస్టులు ఎలా భర్తీ చేసారో తెలపాలని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. అవినీతి అధికారి సాక్ష్యాలు తారుమారు చేయకుండా ముందుగా అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేసి, సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేనిచో నీటి సరఫరా, ఇతర విభాగాల అవినీతి పైన సిటు పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



వాహన చోదకులకు హార్ట్ హెల్త్ చెకప్ ఉచిత కూపన్లు అందజేస్తున్న ఆస్పత్రి ప్రతినిధి

డాబాగార్డెన్స్: సామాజిక కార్యక్రమాల్లో భాగంగా ఓమ్ని ఆస్పత్రి ఆదివారం వాహన చోదకులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. నగర పోలీస్ సిబ్బందితో కలిసి నగరంలోని మూడు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రత, నియమాలు, ప్రమాదాల నివారణపై ఇటు ప్రజలు, అటు వాహన చోదకులకు అవగాహన కార్యక్రమాలు సిరిపురంలోని వాల్తేర్ క్లబ్, రామ్‌నగర్‌లోని రాఘవేంద్రస్వామి ఆలయం డౌన్ రోడ్డు, జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్ వద్ద నిర్వహించారు. గాంధీ గిరి పేరిట చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఓమ్ని ఆస్పత్రి సిబ్బంది ట్రాఫిక్ పోలీసులతో కలిసి హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ఆవశ్యకత, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్లడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు తూచ తప్పకుండా పాటించి ప్రమాదాలు నివారించాలని సూచించారు. ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రిలో ఉచితంగా అందించే హార్ట్ హెల్త్ చెకప్ కూపన్లు వాహన చోదకులకు పంపిణీ చేశారు. ఈ కూపన్ ద్వారా ఉచితంగా కన్సల్టెన్సీ, గుండె ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్టు ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు.

నేడు హనుమత్ యజ్ఞం

మహారాణిపేట: ఎంవీపీ కాలనీ భద్రం కమ్యూనిటీ హాల్లో సోమవారం హనుమత్ యజ్ఞం భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. కందాల శ్యామ్, అరుణా గాయిత్రీ దంపతుల ఆధ్వర్యంలో పూర్వభాద్ర నక్షత్ర యుక్త కార్తీక సోమవారం నాడు ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కశింకోట గురువులు రేజేటీ రామాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 13న వాసవీ క్లబ్ నిర్వహణలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ సుమారు నాలుగు వేల మంది భక్తులతో గురజాడ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్టు కందాల శ్యామ్, అరుణా గాయిత్రీ తెలిపారు.